# అప్రమత్తంగా ఉండాలి

- ఆదిలాబాద్ ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి
- బేల శంకర్‌గూడ చెక్‌పోస్టు తనిఖీ



బేల : శంకర్‌గూడ చెక్‌పోస్టును పరిశీలిస్తున్న ఆదిలాబాద్ ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి

బేల, అక్టోబర్ 18 : ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదిలాబాద్ ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి సూచించారు. ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలోని శంకర్‌గూడ చెక్‌పోస్టును బుధవారం ఆయన తనిఖీ చేశారు. రిజిస్టర్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. మహారాష్ట్ర నుంచి ఎటువంటి మద్యం, ఎలక్షన్లలో ప్రభావితం చేసే సామగ్రి, డబ్బు, గంజాయి జిల్లాలోనికి ప్రవేశించకుండా చూడాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చెక్‌పోస్టులో ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని ఆదేశించారు. ఆయన వెంట సీఐ కోల నరేశ్‌కుమార్, ఎస్ఐ రాధిక , సిబ్బంది ఉన్నారు.

### పిప్పర్‌వాడ, ఆనంద్‌పూర్ చెక్‌పోస్టు తనిఖీ

జైనథ్, అక్టోబర్ 18: మండలంలోని పిప్పర్‌వాడ, ఆనంద్‌పూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును బుధవారం ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుల గుండా అక్రమ మార్గంలో డబ్బులు, మద్యం, ప్రజలకు ప్రలోబాలు పెట్టే వస్తువులు, సామగ్రిని అడ్డుకోవాలన్నారు. 24 గంటలు పోలీస్ నిఘాను పెంచి అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట సీఐ నరేశ్‌కుమార్ ఎస్ఐ పురుషోత్తం, ఏఎస్ఐ ఆత్మారాం, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# వందశాతం ఓటింగ్ నమోదయ్యేలా చూడాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్
- బోథ్‌లో ఓటరు చైతన్య ర్యాలీ ప్రారంభం

బోథ్, అక్టోబర్ 18 : రానున్న శాసన సభ ఎన్నికల పోలింగ్‌లో వంద శాతం ఓటింగ్ నమోదయ్యేలా చూడాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులకు సూచించారు. ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లో బుధవారం నిర్వహించిన ఓటరు చైతన్య ర్యాలీని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు నమోదు కోసం ఈ నెల 31వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. ఓటరు జాబితాలో పేర్లున్న ప్రతి ఒక్కరూ ఓటహక్కు వినియోగించుకునేలా బూత్ లెవల్ అధికారులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు చైతన్యం చేయాలన్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా బోథ్ నియోజకవర్గంలో పోలింగ్ నమోదు అయ్యేలా ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల నియమావళిని అనుసరించి నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి శ్రీనివాస్, స్వీప్ ప్రోగ్రాం నోడల్ అధికారి వెంకటేశ్వర్లు, బోథ్ తహసీల్దార్ సుభాష్‌చందర్, ఎన్నికల విభాగం డీటీ సూరజ్‌రావ్, అన్ని మండలాల తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.



బోథ్ : ర్యాలీని ప్రారంభిస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్, ఆర్వో చాహత్ బాజ్‌పాయ్

### బోథ్ ఆర్వో కార్యాలయం ప్రారంభం ..

బోథ్ తహసీల్ కార్యాలయం పక్కన నిర్మించిన రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని కలెక్టర్, ఐటీడీఏ పీవో ప్రారంభించారు. రూ 40 లక్షలతో భవనాన్ని నిర్మించారు. శాసనసభ ఎన్నికల విధులతో పాటు కార్యాలయ కార్యకలాపాలు ఇక్కడి నుంచే నిర్వహించనున్నారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ డీఈఈ శైలేందర్, ఏఈఈ నర్సింగ్, అధికారులు పాల్గొన్నారు.

### రాజకీయ పార్టీలు ఎన్నికల నియమావళిని పాటించాలి...

అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల నియమావళిని పాటించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. ఆర్వో కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ప్రచార ర్యాలీలు, సభలు, లౌడ్ స్పీకర్లు, కటౌట్లు, తోరణాలు తదితర వాటికి తప్పని సరిగా అనుమతి తీసుకోవాలన్నారు. సువిధ యాప్ ద్వారా 48 గంటలు ముందుగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. నేరుగా ఆర్వో కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ప్రతి బుధవారం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. నామినేషన్ల ప్రక్రియ అనంతరం అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లతో సమావేశాలు ఉంటాయన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా అందరూ సహకరించాలని కోరారు.

## ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలి

సోన్, అక్టోబర్ 18 : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మహారాష్ట్ర నుంచి తెలంగాణలోకి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని నిర్మల్ ఎస్పీ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఎన్నికల నియమావళిలో భాగంగా ఏర్పాటు చేసిన చించోలి(బీ), సోన్, కొండాపూర్‌లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను బుధవారం ఆయన తనిఖీ చేశారు. సిబ్బంది విధులను పరిశీలించారు. ఇప్పటి వరకు సీజ్ చేసిన నగదు, లిక్కర్, ఇతర వస్తువుల వివరాలను చెక్‌పోస్టు అధికారులు ఎస్పీకి వివరించారు. వాహనాల తనిఖీల సమయంలో వీడియోగ్రఫీ తీసుకోవాలని, రూ. 50వేలకు మించి పట్టుబడిన నగదును పంచనామా నిర్వహించి జిల్లా గ్రీవెన్స్ కమిటీకి అప్పగించాలని అధికారులకు సూచించారు. చెక్‌పోస్టులో విధులు నిర్వర్తించే సిబ్బందికి అవసరమైన సదుపాయల గురించి పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట సీఐలు శ్రీనివాస్, నవీన్‌కుమార్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

## బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్‌పై చీటింగ్ కేసు

ఎదులాపురం, అక్టోబర్ 18 : ఆదిలాబాద్ జిల్లా మావల మండలంలోని బట్టిసావర్గాం గ్రామ పంచాయతీ పరిధిలో గల రెండు ప్లాట్ల విషయమై బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్, అమ్మకంలో భాగస్వామి అయిన సుదర్శన్‌పై కూడా చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఆదిలాబాద్ టూ టౌన్ సీఐ అశోక్ తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ఆదిత్య ఖండేష్కర్‌కు బట్టిసావర్గాం సర్వే నంబర్ 53/2లో రెండు ప్లాట్లను 2012 సంవత్సరంలో ఎమ్మెల్యే బాపురావ్, సుదర్శన్‌లు అమ్మారు. మళ్లీ ఇదే సర్వే నంబర్ గల భూమిని 2019 సంవత్సరంలో సంతోష్ అనే వ్యక్తికి రిజిస్ట్రేషన్ చేశారు. ఈ విషయం ఆదిత్య ఖండేష్కర్‌కు తెలిసింది. దీంతో ఆయన కోర్టును ఆశ్రయించాడు. కోర్టు ఆదేశాల మేరకు మంగళవారం రాత్రి ఎమ్మెల్యే రాథోడ్ బావురావ్, సుదర్శన్‌లపై 420,409, 416,421,423 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## దసరా పండుగ సందర్భంగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 18 : ఆర్టీసీ సంస్థను మరింత లాభాల్లో తీసుకురావడానికి 100 రోజుల పండుగ అనే కార్యక్రమంతో ముందుకు వెళ్తున్నామని ఆదిలాబాద్ రీజినల్ మేనేజర్ సోలేమాన్ తెలిపారు. దసరా పండుగ సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని ఆరు డిపోల పరిధిలో సుమారు 400కు పైగా ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు.40 మందికి పైగా ప్రయాణికులు ఉంటే ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు. దసరా పండగ సందర్భంగా లక్కీ డ్రా నిర్వహిస్తున్నామని తెలిపారు.

# ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 18: ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ మద్యం అక్రమ నిల్వలు, మద్యం రవాణా చేస్తే వారిపై నిఘాను పటిష్టం చేశామని ఎక్సైజ్ సూపరింటెండెంట్ జీ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం నిర్మల్‌లోని సమీకృత కలెక్టరేట్‌లోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 9న వెలువడిన ఎన్నికల నియమావళి నుంచి 17 వరకు జిల్లాలోని ఎక్సైజ్ పరిధిలో మద్యంకు సంబంధించి 102 కేసులు నమోదు చేశామని, ఇందులో 35 మందిని అరెస్ట్ చేశామని తెలిపారు. 382 లీటర్ల నాటు సారా, 46,100 లీటర్ల బెల్లం పానకం, 362 లీటర్ల బెల్లం, 20 కిలోల పటిక, 1587 లీటర్ల మద్యం, 9లీటర్ల దేశీదారు, 3 వాహనాలు సీజ్ చేశామని చెప్పారు. వీటి విలువ రూ.68,12,250 ఉంటుందని తెలిపారు. మంగళవారం రాత్రి భైంసాలోని ఓ వైన్స్‌లో ఉండాల్సిన మద్యం గోదాంలో నిల్వ చేయడంతో అందిన సమాచారం మేరకు ఎక్సైజ్ సీఐ నజీర్ తనిఖీ చేశారు. అందులో సుమారు రూ.16 లక్షల విలువ చేసే 108 కేసుల మద్యాన్ని సీజ్ చేశామని తెలిపారు. ఎన్నికల నిబంధనలు మద్యం వ్యాపారులు పూర్తిగా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్సులు రద్దు చేస్తామని అన్నారు. సమావేశంలో సీఐలు సంపత్ కృష్ణ, నజీర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు రమేశ్, గంగారెడ్డి, డీటీఎఫ్ సీఐ రంగస్వామి పాల్గొన్నారు.

## తనిఖీల్లో నగదు స్వాధీనం

భైంసా, అక్టోబర్ 18 : అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. నిర్మల్ జిల్లా భైంసాలో మంగళవారం రాత్రి ఎస్ఐలు శ్రీకాంత్, పూర్ణేశ్వర్ వాహనాలు తనిఖీ చేశారు. కరీంనగర్ నుంచి నాందేడ్ వెళ్తున్న రిచ్ పాల్ చౌదరి దగ్గర అనాధికారికంగా ఉన్నటువంటి రూ. 1,38,500 నగదును పట్టుకున్నారు. ఈ నగదును స్వాధీనం చేసుకొని ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు వారు తెలిపారు.

### రూ.88వేలు పట్టివేత



మామడ: పట్టుకున్న నగదుతో ఎస్ఐ రాజు

మామడ, అక్టోబర్ 18 : నిర్మల్ జిల్లా మామడ మండలంలోని లింగాపూర్ గ్రామ సమీపంలో బుధవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో రూ.88వేలు పట్టుకున్నామని ఎస్ఐ రాజు తెలిపారు. మామడ నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న బొలెరో వాహనం తనిఖీ చేయగా ఎలాంటి పత్రాలు లేకపోవడంతో రూ.88వేలు నగదును పట్టుకొని సీజ్ చేసినట్లు తెలిపారు.సరైన ఆధారాలు లేకుండా రూ.50వేలకు మించి తరలిస్తే సీజ్ చేస్తామని ఆయన పేర్కొన్నారు.

## కూష్మాండ రూపంలో అమ్మవారు

బాసర, అక్టోబరు 18 : దసరా నవరాత్రోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు బుధవారం నిర్మల్ జిల్లా బాసర సరస్వతీ అమ్మవారు కూష్మాండ రూపంతో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో సుహాసిని పూజ, మంత్రపుష్పం, చతుర్వేద పారాయణం, లలిత సహస్రనామాలు, నివేదన హారతి, తదితర పూజలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి అర్చకులు అల్లం వడలు నైవేద్యంగా సమర్పించారు. సరస్వతీ అమ్మవారిని భక్తులు దర్శించుకొని ఆలయంలో ఉచితంగా నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.

### ఉచిత వైద్య శిబిరం

అమ్మవారి నవరాత్రులకు వచ్చే భక్తుల కోసం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో డాక్టర్ తిరుమల వైద్య పరీక్షలు నిర్వహించారు. సుమారు 100 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు.

## రైతుపై హమాలీ దాడి

భైంసా, అక్టోబర్ 18 : భైంసాలోని గాంధీ గంజ్‌లో లోకేశ్వరం మండలం వాటోలి గ్రామానికి చెందిన శ్రీనివాస్ అనే రైతు బుధవారం సోయాను అమ్మడానికి తీసుకొచ్చాడు. అయితే సోయాగాలి పట్టిన అనంతరం వెస్టేజ్ సోయాను హమాలీ తనకు కావాలని రైతును కోరగా ఇవ్వనని సంచిలో నింపుకుంటానని సంచి తీసుకుంటున్నాడు. అక్కడే ఉన్న హమాలీ రేకుడబ్బా పీపాతో రైతు శ్రీనివాస్‌ను కొట్టడంతో గాయలయ్యాయి. వెంటనే రైతులు గుమిగూడి నిరసన చేపట్టారు. అనంతరం పట్టణ సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు అక్కడికి చేరుకొని రైతును సముదాయించి చికిత్స నిమిత్తం దవాఖానకు తీసుకెళ్లారు. హమాలీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

## కార్మికులకు దసరా కానుకలు పంపిణీ



కార్మికులకు కానుకలు అందజేస్తున్న డిపో మేనేజర్ కల్పన

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 18 : ఆదిలాబాద్ ఆర్టీసీ డిపోలో పని చేస్తున్న మహిళా పారిశుధ్య కార్మికులకు డిపో మేనేజర్ కే కల్పన తన సొంత ఖర్చులతో దసరా కానుకలు అందజేశారు. బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ సోలేమాన్ పాల్గొని కార్మికులకు దసరా కానుకలు అందజేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్‌ను అభినందించారు. ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంతో పాటు డిపోను పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర ఎంతో కీలకమని డిపో మేనేజర్ పేర్కొన్నారు.